

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 13 జనవరి 2026 పేజీలు : 04


# నాణ్యత ప్రమాణాలతో పుట్టపర్తి రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి

### ఆర్ అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి ఎమ్మెల్యే తదితరులు

పుట్టపర్తి టౌన్, జనవరి 12, ప్రభాతవార్త

పుట్టపర్తి పట్టణ అభివృద్ధి దిశగా చేపట్టిన రింగ్ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తవ్వాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రింగ్ రోడ్డు నిర్మాణాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూ.2.5 కోట్ల వ్యయంతో చేపట్టిన రింగ్ రోడ్డు పుట్టపర్తి పట్టణానికి ఎంతో ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. ముఖ్యంగా పుట్టపర్తి ఎయిర్‌పోర్టు రోడ్డులో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ఈ బైపాస్ రోడ్డు శాశ్వత పరిష్కారం అందిస్తుందని అన్నారు. రహదారి నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సాధించాలని, రింగ్ రోడ్డుపై గుంత తవ్వించి రహదారి పొరలు, ఉపయోగించిన మెటీరియల్‌ను పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని, ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి పట్టణానికి రింగ్ రోడ్డు ఒక వరమని, ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా పట్టణ అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి వంటి అంతర్జాతీయ గుర్తింపు కలిగిన ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి అత్యంత అవసరమని, రింగ్ రోడ్డు నిర్మాణంతో పట్టణ రూపురేఖలు మారతాయని అన్నారు. నాణ్యమైన రహదారులు ప్రజల భద్రతకు, అభివృద్ధికి పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖకు అధికారులు, ఇంజనీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మరోమారు చరిత్ర సృష్టించిన రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్

### - బెంగుళూరు విజయవాడ కారిటార్‌పై నాలుగు గిన్నిస్ రికార్డులు

శ్రీసత్యసాయి జిల్లా, జనవరి 12, ప్రభాతవార్త ప్రతినిధి:

జాతీయ రహదారి 544 జి - బెంగుళూరు విజయవాడ ఎకనమిక్ కారిడార్ పై నాలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల సృష్టించి రాజ్‌పథ్ ఇన్ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ చరిత్ర సృష్టించింది. గతంలో రహదారి నిర్మాణ విభాగంలో ఒక ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, ఒక గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన మహారాష్ట్రలోని పుణెకు చెందిన రాజ్ పథ్ ఇన్ఫ్రాకాన్ ప్రయివేట్ లిమిటెడ్, మరో మారు అదే విభాగంలో నాలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులను సాధించారు. ఈ క్రమంలో గతంలో తాము సాధించిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును తామే బద్దలు కొట్టడం విశేషం. ఈ రికార్డులను సోమవారం ఉదయం ఒక ప్రత్యేక కార్యక్రమంలో లండన్‌కు చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులు న్యాయ నిర్ణేత నవీన్ పటేల్, కేంద్ర ఉపరితల, రవాణ రహదారుల మంత్రి నితిన్ గడ్కరి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రకటించారు. కేవలం 24 గంటల్లో 28.89 లేన్ కిలోమీటర్ల మేర నిరంతరాయంగా అత్యధికంగా 10,655 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేయడంలో రికార్డు కాగా, 57,500 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేయడంలో 156 సింగిల్ లేన్ కిలోమీటర్ల మేర నిరంతరాయంగా రహదారి నిర్మాణం చేయడంలో రికార్డుదీనికి సంబంధించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల వారు జారీ చేసిన సర్టిఫికేట్లను న్యాయ నిర్ణేత ప్రవీణ్ పటేల్ చేతుల మీదుగా రాజ్‌పథ ఇన్‌ఫ్రాకాన్ సిఎండి జగదీష్ కదంకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించడంలో నేషనల్ హైవేస్ అథారిటీ చేసిన అద్భుతమైన పనిని ప్రశంసించారు. "గతంలో గిన్నిస్ రికార్డు అంటే ప్రజలు జర్మనీ, జపాన్, అమెరికా వంటి దేశాల గురించి మాట్లాడేవారని, కానీ ఇప్పుడు భారతదేశం ఈ రకమైన విజయాల ద్వారా ప్రపంచానికి తన సాంకేతిక నైపుణ్యాన్ని చాటి చెబుతోందన్నారు. దేశ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని, భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ, దేశంలో రహదారి మౌలిక సదుపాయాలను ఏ వేగంతో నిర్మిస్తున్నారో వివరించారు. భగవాన్ సత్యసాయి పుణ్యభూమిలో ఈ నాలుగు రికార్డులను సాధించడంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులను వేగవంతం చేయడానికి రహదారి నిర్మాణంలో సరికొత్త సాంకేతికతలను ఉపయోగిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇటీవల సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తలు వరి మొక్కను ఉపయోగించి బిటుమినస్‌ను తయారు చేయగల సాంకేతికతను అభివృద్ధి చేశారని, ఆ పేటెంట్‌ను అనేక కంపెనీలకు బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వరి పంటను అధికంగా పండిస్తున్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి, దేశాన్ని ప్రగతిపథంలో నడిపించే సామర్థ్యం భారతదేశానికి ఉందని, ఇప్పుడు ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు అతిథులకు స్వాగతం పలుకుతూ, కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జగదీష్ కదమ్ ఈ ఘనతను సాధించడానికి సంస్థ చేపట్టిన వివిధ ప్రయత్నాలను వివరించారు. ఈ సవాలుతో కూడిన పనిని పూర్తి చేయడంలో అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించినందుకు ఇంజనీర్లు, కార్మికులు, ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ అధికారులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. రహదారుల నిర్మాణ రంగంలో రాజ్‌పథ్ జాతీయ నిర్మాణానికి కొత్త ప్రేరణను అందిస్తూనే ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, హిందూపురం ఎంపీ బి.కె. పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంజనీర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రేపటితో ముగియనున్న ఏపీసీ డిప్యూటేషన్ గడువు




- రెన్యువల్ చేస్తారా? లేదా? అన్నది ఉత్కంఠ
- సమగ్రశిక్షలో ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్

అనంతపురం న్యూటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డిప్యూటేషన్ గడువు బుధవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రెన్యువల్ చేస్తారా? లేదా? అన్నది ఉత్కంఠం నెలకొంది. అనంతపురం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా డ్వామా జిల్లా కార్యాలయంలో పర్యవేక్షకులుగా పని చేస్తున్న ఎంపీడీవో టి. శైలజ డిప్యూటేషన్ పై గత ఏడాది జనవరి 14వ తేదీ నియామకం అయ్యారు. అయితే ఆ డిప్యూటేషన్ గడువు ఈనెల 14వ తేదీతో ముగియనుంది. అయితే ఏపీసీ గత ఏడాది డ్వామా పీడీ పోస్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో చేసేది ఏమీ లేక సమగ్రశిక్ష ఏపీసీ పోస్టుకు ఏడాది డిప్యూటేషన్ తెచ్చుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీసీ కి గత కొన్ని నెలలుగా డిఆర్డిఏ ఇన్ ఛార్జ్ పిడి గా కూడా అదనపు బాధ్యతలను జిల్లా కలెక్టర్ అప్పగించడం జరిగింది. అయితే ఏపీసీ డిఆర్డిఏ పిడి గా పనిచేయడానికి ఇష్ట పడుతున్నారని, అందులో భాగంగా ఏపీసీ పోస్టు నుండి రిలీవ్ చేయాలని ఇటీవల ఎస్పీడిని కూడా కోరినట్లు సమగ్రశిక్ష, డిఆర్డిఏ, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అయితే ఏపీసీగానే కొనసాగడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇటీవల ఎస్పీడిని కలిసినప్పుడు సివిల్స్ వర్క్స్ బాగా జరిగినట్లు ప్రోగ్రామ్స్ ఉంటేనే అవకాశం ఇస్తామని చెప్పినట్లు సమాచారం. అయితే ఏపీసీగా రెన్యువల్ చేస్తారా? లేదా? అన్నది సమగ్రశిక్షలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# హైకోర్టు ఆదేశాలతో వివాదాస్పద భూమిలో పంట కోత..!



పోలీసు బందోబస్తు నడుమ రైతు జయకుమార్ యంత్రాలతో పంట కోతలు చేపట్టిన దృశ్యం

- బాధిత రైతు జయకుమార్‌కు బందోబస్తు కల్పించిన పోలీసులు
- కోసిన పంట రెవెన్యూ అధికారుల సమక్షంలో వ్యాపారికి విక్రయం
- ఆర్డీవో సమక్షంలో పంట విక్రయ మొత్తం పంపిణీపై నిర్ణయం
- వివాదాస్పద 21.05 ఎకరాల్లో ప్రశాంతంగా పంట కోత, విక్రయం



పంట కోతల అనంతరం ట్రాక్టర్లతో కందులను నింపుతున్న దృశ్యం

ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) ఉత్తర్వులతో వివాదాస్పందంగా మారిన విడపనకల్లు మండలం జనార్ధనపల్లి గ్రామంలోని వేల్పుమడుగు గ్రామ సర్వే నంబర్ 141లోగల 21.05 ఎకరాల్లో సాగైన కంది పంట కోతలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పంటను భూమి యజమాని అయిన రైతు జయకుమార్ కోసుకోవచ్చని ఇందుకు పోలీసులు భద్రత కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు వెలువరించిన క్రమంలో రైతు ఉదయం పంట కోత యంత్రాలతో గ్రామానికి చేరుకోగా గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ఉరవకొండ యుపీఎస్ సీఐ మహానంది పర్యవేక్షణలో విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుసేన్ సిబ్బందితో బందోబస్తు కల్పించగా రెండు గంటల్లో పంట కోతలు పూర్తి అయ్యాయి. అనంతరం సిబ్బందితో అక్కడికి వచ్చిన విడపనకల్లు డిప్యూటీ తహశీల్దార్ చంద్రమోహన్‌రావు ట్రాక్టర్లలో పంటను రెవెన్యూ కార్యాలయం తరలించారు. సాయంత్రం పంటను రైతు సమక్షంలో వ్యాపారికి విక్రయించి డబ్బును తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ చంద్రమోహన్‌రావు విలేఖరులతో మాట్లాడుతూ ఆర్డీవో సమక్షంలో పంట విక్రయించిన మొత్తాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఆర్ఐ పోతన్న, వీఆర్వో సునీత సిబ్బంది ఉన్నారు. రైతు ఉరవకొండ పట్టణానికి చెందిన జయకుమార్ 2023లో సదరు భూమిని కొనగోలు చేయగా సదరు భూమి దేవుని మాన్యం భూమి అంటూ వివాదం నడుస్తున్న విషయమై తెలిసిందే. ఈక్రమంలోనే రైతు జయకుమార్ కోర్టులు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి గత ఏడాది డిసెంబర్ 26న సదరు భూమిలో సాగు చేసిన కంది పంటను కోయడానికి యంత్రాలను తీసుకొని వెళ్లిన సమయంలో గొడవ జరుగగా శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందంటూ పోలీసులు పంట కోతలను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రైతు జయకుమార్ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించగా రైతు పంట కోసుకోవడానికి అనుమతిచ్చింది.

### తుంగభద్ర జలాశయంకు చురుగ్గా

# కొత్త గేట్ల ఏర్పాటు పనులు..!





తుంగభద్ర జలాశయంకు 18వ కొత్త గేటును అమరుస్తున్న దృశ్యాలు

- జలాశయం 18వ గేటును విజయవంతంగా అమర్చిన అధికారులు
- ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనడానికి ఇదొక ఉదాహరణ
- రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త

కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్ సమీపంలోగల కర్ణాటకఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయంకు పాత గేట్ల స్థానంలో కొత్త గేట్ల అమరిక ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం తెలిపారు. గేట్ల అమరికలో భాగంగా జలాశయం18వ పాత గేటు స్థానంలో కొత్త గేటును ఇంజనీరింగ్ అధికారులు నిపుణుల పర్యవేక్షణలో విజయవంతంగా అమర్చారన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తోందడానికి ఇదొక ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు. కాగా తుంగభద్ర జలాశయం 19వ గేటు 2024 ఆగస్టు 10వ తేదీన వరద ప్రవాహం కారణంగా చైన్ లింక్ తెగి కొట్టుకొని పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశంలోనే సంచలనం రేపిన విషయం విధితమే. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో విశ్రాంత ఇంజనీరింగ్ నిపుణులు కన్నయ్య నాయుడు పర్యవేక్షణలో కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్ లాగ్ గేటును అమర్చిన విషయం తెలిసిందే. కేంద్ర జల వనరుల ఇంజనీరింగ్ నిపుణుల బృందం డ్యామ్ ను సందర్శించి అన్ని గేట్లను మార్చాల్సిందేనని నిర్ణయించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం జలాశయం గేట్ల మార్పునకు శ్రీకారం చుట్టింది.

# ఆ రోజు జగన్ బొమ్మలపై ఐఏఎస్‌లు ఎందుకు అభ్యంతరం చెప్పలేదో..?

### - రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత - ధర్మవరం ఆర్డీవోతో ఎమ్మెల్యే భేటీ



ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జనవరి 12 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్రంలో భూ సమస్యలకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని, వైసీపీ ప్రభుత్వంలో పాస్ బుక్కులపై వైఎస్ జగన్ బొమ్మల పై ఐఏఎస్ అధికారులు ఎందుకు అడ్డు చెప్పలేదు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభిప్రాయపడ్డారు. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఉన్న భూసమస్యలకు వేగంగా పరిష్కారం చూపించాలని ధర్మవరం ఆర్డీఓకు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే రెవెన్యూ క్లినిక్ కార్యక్రమానికి సోమవారం ఆమె వెళ్లారు. ఆర్డీఓ మహేష్‌ను కలిసి ప్రస్తుతం పట్టాదారు. పాసుపుస్తకాల పంపిణీ నేపథ్యంలో రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను వివరించారు. భూ వ్యత్యాసాలు, భూ వర్గీకరణ, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు సర్వే నంబరు తప్పిదాలు, జాయింట్ ఎల్పీఎంలు, మిగులు భూములువంటి వాటి గురించి వివరించారు. ఈ సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లు, వీఆర్ఓలు ఇతర సిబ్బంది వేగంగా పని చేసేలా చూడాలని కోరారు. రైతులకు వీటిపై అవగాహన కల్పిస్తూ.. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. దీనిపై ఆర్డీఓ కూడా సానుకూలంగా స్పందించారు. కొన్నింటికి అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. భూ ఆధారిత సమస్యల పరిష్కారంపై ఈ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని ఇప్పటికే రెవెన్యూ మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో భూముల రికార్డులను అస్తవ్యస్తం చేశారన్నారు. పైగా తన సొమ్ము ఏదో ఇచ్చినట్టు పాసుబుక్కుల్లో జగన్ రెడ్డి తన ఫోటో వేసుకున్నారని విమర్శలు చేశారు. ఆ రోజు ఐఏఎస్‌లు ఎందుకు దీనికి అడ్డు చెప్పలేదో అర్థం కావడం లేదన్నారు. మా ప్రభుత్వం వచ్చాక సమస్యల్ని పరిష్కరిస్తూ రాజముద్రతో పాసుపుస్తకాలు ఇస్తున్నామన్నారు. గతంలో జరిగిన తప్పుల్ని సరి చేస్తున్నామని.. ఇది రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాయింట్‌గా ఉన్న భూముల విషయంలో రైతులు ఒక నిర్ణయానికి రావాలని, వీటిపై పంతంతో ఉంటే మీ పేరుతో ఎక్కువ భూములు చూపిస్తాయన్నారు. దాని వలన మీకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందకపోవచ్చని అన్నారు. పరస్పరం అంగీకారంతో మీరు అధికారుల వద్దకు వెళ్తే మీరు మీకున్న పొలం ప్రకారం పట్టాదారు. పాసుపుస్తకాలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# టమోటా దిగుబడి బారెడు... ధరలు చూస్తే జానెడు...

### - అన్నదాత కు కొండంత వ్యధ ....దళారులకు మాత్రం సిరుల పంట



ధర్మవరం రూరల్ జనవరి 12 ప్రభాతవార్త

రైతులు ఆరుగాలం శ్రమించి కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటున్నారు.. పంటకు ఆశించిన5 చీడపీడ వ్యా ధుల నివారణకు రూ. లక్షలు ఖర్చు చేసి రసాయనిక మందులను పిచికారి చేసి నివారణ చేస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టిన అనంతరం పంట దిగుబడి బాగా ఉందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తారు. కానీ మార్కెట్ కి వచ్చే సరికే నిలకడ లేని ధరలతో పంట దిగుబడి బహు బాగున్నా... మార్కెట్లో ధరలు పతనం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సరైన గిట్టుబాటు ధరలు ప్రభుత్వం కల్పించి అన్నదాతలను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లా ధర్మ వరం మండలం రావులచెరువు గ్రామానికి చెందిన రైతు నారాయణస్వామి యాజమాన్య పద్ధతిలో ఐదు ఎకరాల్లో హైబ్రిడ్ రకమైన రవి టమోటా మొక్కలను నాటాడు. ఐదు ఎకరాల్లో సాగు చేయడానికి సుమారు ఎకరానికి రూ.రెండు లక్షల చొప్పున ఐదు ఎకరాలకు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టా డు. సాగు విధానం ఎలా... ముందుగా ఐదు ఎకరాలను ట్రాక్టర్ తో దున్న కం చేశాడు.

అనంతరం గుంటక పాసి... నేలను మెత్తగా సిద్ధం చేసి తరువాత వీటితో పాటు సేంద్రీయ ఎరువు నాలుగు ట్రాక్టర్లు దుక్కి కి వేశారు. రవి హైబ్రిడ్ రకం టమోటా మొక్కను రూ. 0.50 చొప్పున నర్సరీలో రూ.60 వేలు మొక్కలకు ఖర్చు చేశారు. అదేవిధంగా టమోటా కాయలు నాణ్యతగా ఉండాలని లక్ష్యంతో కట్టె పద్ధతిలో మొక్కలను పెం చారు. వీటితోపాటు చీడ పీడత వ్యాధులు నివారణకు, కాయలు నాణ్యతగా ఉండాలని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మందులు కోసం సుమారు రూ. 10 లక్షలు పెట్టుబడి పెట్టాడు. దిగుబడి అదుర్స్... రైతు కష్టానికి తగిన విధంగా దిగుబ డి అధికంగా వచ్చింది. ప్రతి మొక్క యాపిల్ సైజు వలె టమోటా దిగుబడి రావడంతో రైతు సంతోషానికి అవధుల్లేవ్. దిగుబడి బాగుంది మంచి లాభాజనులు వస్తాయని టమోటా సాగు రైతు ఆశించాడు. మార్కెట్‌కు విక్రయించడానికి తొలగింపు చేసినప్పుడల్లా 20 కిలోల టమోటా బాక్సులు 500 నుంచి 700 బాక్సుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో 150 నుంచి 200 వరకు టమోటా బాక్సులు ధర పలుకుతుంది. మార్కెట్లో నిలకడలేని ధరల వల్ల రైతు తీవ్రవరంగా నష్టపోతున్నాడు. పంట పండిందని సంబరపడాలా...! ధర లేదని బాధపడాలా..? అనే దయనీయ పరిస్థితుల్లో టమోటా సాగు రైతులు ఉన్నారు. టమోటా సాగు రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించి సాగు రైతులు నష్టపోకుండా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.



# గాడితప్పిన గురువుపై వేటు

### - పద్మనాభయ్యను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు - పత్రికా కథనాలపై స్పందించిన ఉన్నతాధికారులు

తాడిపత్రి, జనవరి 12, ప్రభాతవార్త:

పెద్దపప్పూరు మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గాడితప్పిన గురువు పద్మనాభయ్యపై ఎట్టకేలకు విద్యాశాఖాధికారులు సోమవారం వేటు వేశారు. ఈ నెల 4వ తేదీన ఆ పాఠశాలకు చెందిన మైనర్ బాలికపై అతను అసభ్యంగా ప్రవర్తిస్తూ ఆ బాలిక కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు ప్రత్యక్షంగా దొరికిపోవడంతో దేహశుద్ధి చేసిన సంగతి పెద్ద దుమారం రేపిన విషయం విదితమే. ఈ సంఘటన పాఠశాల వెలుపల చోటు చేసుకోవడంతోనూ, సంఘటన జరిగిన రోజు ఆదివారం కావడంతో స్థానికులు పాఠశాల వద్దకు రాలేకపోయారు. దీంతో బయట పంచాయతీ చేసుకొని రూ. లక్షలు ఖర్చుచేసి వ్యవహారాన్ని చక్కపెట్టుకోవాలని చూశాడనే వాదనలు బలంగా వినిపించాయి. అయితే కొన్ని వార్తా పత్రికల్లో కథనాలు రావడంతోనూ, జిల్లా విద్యాధికారికి సంఘటన జరిగిన తీరుపై చరవాణి ద్వారా సమాచారం చేరడంతోనూ విచారణ చేపట్టారు. సంఘటన పాఠశాల బయట జరిగినా..జరిగింది యదార్థమా..కాదా అని, పత్రికల్లో వచ్చింది వాస్తవమా..కాదా అని జిల్లా విద్యాధికారి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని, మండల విద్యాధికారిని విచారించినట్లు తెలిసింది. సంఘటన జరిగిన మాట వాస్తవమేనని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్షేత్రస్థాయి విద్యాధికారులు మౌఖికంగా పేర్కొనడంతో వారం రోజుల అనంతరం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఈ వివాదానికి, ఆరోపణలకు కారకుడైన గణిత ఉపాధ్యాయుడు పద్మనాభయ్యను తదుపరి ఆదేశాలు అందేవరకు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు, అతని వివరణను పరిశీలించిన తర్వాత ఆరోపణలను నమోదు(ఛార్జెస్ ఫ్రేమ్) చేస్తామని డీవైఈవో మల్లారెడ్డి తెలిపారు. పత్రికల్లో వచ్చిన కథనాల కారణంగా తమ పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న పద్మనాభయ్యను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన మాట వాస్తవమేనని ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం అన్నారు. మండల విద్యాధికారిని వివరణ కోరడానికి ప్రయత్నించగా సమాధానం కరవవడం గమనార్హం.

# బెల్ట్ షాప్‌లు ఉంటే కేసు పెట్టండి

## ఎక్సైజ్ డిసి ఆదేశాలు

హిందూపురం జనవరి 12 ప్రభాతవార్త


సూచనలిస్తున్న డిసి నాగమద్దయ్య

ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులను నిర్వహించడం లేదా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయాలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాలుఇచ్చారు. సోమవారం స్థానిక ఎక్సైజ్‌పోలీస్‌స్టేషన్, రాష్ట్ర సరిహద్దులోని తూముకుంట చెక్‌పోస్ట్ స్టేషన్‌ను ఆయనతోపాటు ఇన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ సూపర్డెంట్ శ్రీరామ్ తనిఖీ నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ దుర్గయ్య పాల్గొన్నారు. స్టేషన్‌లో పలురికార్డులను పరిశీలించి పెండింగ్‌కేసులను, మద్యం అక్రమ రవాణాకేసులలో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలనీ, కల్లు దుకాణల నుండి కల్లు శాంపిల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్ కు పంపించాలని, కల్తీకల్లు అరికట్టేలా కల్లు అమ్మకదారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. కల్తీకల్లు విక్రయ దారుల మీద పిడి యాక్ట్ నమోదు చేయాలని, కర్ణాటక రాష్ట్రమద్యం అక్రమ రవాణా దారుల మీద కేసులు నమోదుచేసి, పాత ముద్దాయిలను అనుమానితులను బైండోవర్ చేయాలని, రెండు అంతకుమించి ఒకవ్యక్తిమీద కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని, ఎక్కువ కేసులు కల్గిన వ్యక్తుల మీద జిల్లా బహిష్కరణ చెర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరారీలో ఉన్న ముద్దాయిలను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్ర మద్యం పై గట్టి నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని చెప్పారు. మద్యం దుకాణము లో మద్యం ఎం ఆర్ పి ధరలకు అమ్మాలని, బెల్టు దుకాణాలు మీద కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. రాబోయే సంక్రాతి పండుగ, సందర్భంగా అదనపు బలగాలతో గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు, అలాగే మెత్తనాల్ యూనిట్లను ఆకస్మికతనిఖీ నిర్వహించడమైనది. తదనంతరం మండలం లోని తూముకుంట చెక్‌పోస్ట్‌నందు వాహనాలుతనిఖీ నిర్వహించి, సిబ్బందికి వాహనాలు క్షుణ్ణగా తనిఖీ చేయాలని, కర్ణాటక రాష్ట్ర అక్రమ మద్యం రవాణా అరికట్టాలని, సిబ్బంది చెక్ పోస్ట్ నందు విధులకు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. మంచి ప్రతిభ చూపిన వారికి, కేసులు నమోదు చేసిన సిబ్బందికి రివార్డ్స్, ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరుగునని, రికార్డు లను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

# జనసేన చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నదానం

## కోలహలంగా చిరు సినిమా వేడుకలు

హిందూపురం జనవరి 12 ప్రభాతవార్త


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ సినిమా విడుదల సందర్భంగా హిందూపురంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు చక్రవర్తి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. ప్రీమియం షో సందర్భంగా


అన్నదానం చేస్తున్న చక్రవర్తి

ముఖ్యఅతిధిగా హాజరైన జనసేన పార్టీ ఇన్చార్జి ఆకుల ఉమేష్, చక్రవర్తి కేకును కట్ చేశారు. అదేవిధంగా బాణసంచా పేల్చుతూ జై చిరంజీవి.. జై పవన్ కళ్యాణ్ అంటూ వారు నినాదాలు చేశారు. సోమవారం సినిమా రిలీజ్ అయిన సినిమా చూసేందుకు వచ్చిన ప్రేక్షకులకు థియేటర్ ఆవరణలో చక్రవర్తి ఆధ్వర్యంలో మిత్ర బృందం అన్నదానం చేశారు. అభిమాన హీరో సినిమా రిలీజ్ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచారు.

# పంచాయతీ అభివృద్ధి అధికారులకు పట్టదా...?


బ్రహ్మసముద్రం సంత దృశ్యం

బ్రహ్మసముద్రం జనవరి 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలో గత సంవత్సరం నుండి వారపు సంత నిర్వహిస్తున్నారు. వారపు సంతను పంచాయితీ అధికారులు వేలం వేయకుండా పంచాయితీ అభివృద్ధికి సహకరించకుండా వారపు సంత జరిగే ప్రదేశానికి దగ్గరలో సచివాలయం ఉన్న వారపు సంతను వేలం వేయకుండా పంచాయితీ అభివృద్ధి అధికారులకు పట్టదా వారపు సంత వేలం ద్వారా వచ్చిన డబ్బును పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసి పంచాయతీ అభివృద్ధి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు వివరిస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందన కలిగి వారపు సంతను వేలం వేస్తారా వేచి చూడాలి.

# పలు గ్రామాలలో పంట కోత ప్రయోగాలు నిర్వహించిన వ్యవసాయ అధికారులు

తాడిమర్రి జనవరి 12 (ప్రభాత వార్త)


కందిలో పంట ప్రయోగాలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో పంట కోత ప్రయోగాలు వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో పంట భీమా కంపెనీలు పంట కోత


వరిలో పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు, భీమ కంపెనీలు

ప్రయోగాలు చేపట్టారు. పిన్నదరి, మరవ పల్లి అగ్రహారం, నిడిగల్లు, కునుకుంట్ల, కొండమనాయనిపాలెం, పెద్దకోట్ల, తిరుమలాపురం, తాడిమర్రి, సి.సి.రేవు గ్రామాలలో మొత్తం 26 కంది పంట కోత ప్రయోగా లు నిర్వహించారు. వేరుశనగ 12, వరి 4 ప్రయోగాలు నిర్వహించారు. వేరుశనగ వాతావరణ భీమా, కంది,వరి దిగుబడి ఆధారిత భీమా పథకంలో భాగంగా నిర్వహించారు.సాధారణ పంట దిగుబడి వచ్చినట్లుగా గుర్తించారు. పంట దిగుబడి ప్రయోగాలలో ఏఐసి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ , ఇఫ్కో టోకియో భీమా కంపెనీ, ప్రభుత్వ అధికారుల సమక్షంలో భీమా కంపెనీలు మరియు వ్యవసాయ శాఖ గణాంక శాఖల పర్యవేక్షణలో రైతుల పొలాలలో ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమా కంపెనీల అధికారులు,మండల గణాంక అధికారి సౌమ్య, ఏఇఓ వైష్ణవి, భీమా కంపెనీ అధికారి చంద్రమోహన్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వారధి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం

హిందూపురం జనవరి 12 ప్రభాతవార్త


రక్తదానం దృశ్యం

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం వారధి సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ట్రస్టు నిర్వాహకులు నిమ్మకాయల రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాఘవేంద్ర కూడా రక్తదానం చేశారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, జనసేన ఇంచార్జ్ ఉమేష్, రోడ్ల అభివృద్ధి డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, చారు కీర్తి మొదలవారు పాల్గొన్నారు.

# నింకంపల్లి మాస్టర్ ప్లాన్ మార్చండి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న నింకంపల్లి వాసులు

హిందూపురం టౌన్ జనవరి 12 ప్రభాతవార్త

హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని నింకంపల్లిలో కొత్తగా మాస్టర్ ప్లాన్ లో చేర్చిన 60 అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని సోమవారం స్థానికులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నింకంపల్లిలోని 19,20,22 వార్డులలో ప్రస్తుతం ఉన్న రోడ్లు ట్రాఫిక్కు అంతరాయం లేకుండా జరుగుతోందని, మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా అత్యుత్సాహంతో మాస్టర్ ప్లాన్లో 60 అడుగుల రోడ్డును చేర్చడం జరిగింది. ఈ రోడ్డు విస్తరణ జరిగితే తాము నిర్మించుకున్న గృహాలు వెళ్లిపోతాయి దీంతో తాము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీవి దుష్ప్రచారాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

హిందూపురం టౌన్ జనవరి 12 ప్రభాతవార్త

ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మరని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాయలసీమ జోనల్ ఇన్చార్జ్ గుడిసె దేవానంద్ అన్నారు. సోమవారం హిందూపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్లో బిజెపి నాయకులు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకానికి 2.13 లక్షల కోట్లు ఖర్చు చేయగా భారతీయ జనతా పార్టీ ఇదే పథకానికి 8.53 లక్షల కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. భారతీయ జనతా పార్టీ పట్ల దేశ ప్రజలు పూర్తి విశ్వాసంగా ఉన్నారని భారతీయ జనతా పార్టీ లక్ష్యం కూడా దేశ ప్రజలను అన్ని విధాల ముందుకు తీసుకువెళ్లడమే తప్ప కాంగ్రెస్ ప్రచారాలలో వాస్తవం లేదని కొట్టిపడేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బటబాగ్ని అమర్, పార్లమెంట్ కన్వీనర్ రమణ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ రెడ్డి, తిరుమలేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ అశోక్, 11వ వార్డు కౌన్సిలర్, బిజెపి పట్టణ అధ్యక్షురాలు, అంజలి రమేష్ రెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనేకల్‌లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు - హనుమంత్ రెడ్డి

కనేకల్, జనవరి 12 ప్రభాతవార్త :


కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా కనేకల్ పట్టణంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధికారికంగా ప్రారంభించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ఆదేశాల మేరకు, రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ గుడిసెలపల్లి హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాయదుర్గం, హిరేహాల్, కనేకల్ మండలాల్లో మొత్తం మూడు కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గతంలో రైతులు తమ పంటలను దళారులకు తక్కువ ధరలకు విక్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఈ పరిస్థితి మారాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పిస్తోందని చెప్పారు. ఇప్పటికే డిసెంబర్ 2న ప్రారంభించిన వరి కొనుగోలు కేంద్రం ద్వారా రికార్డు స్థాయిలో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, సుమారు రూ.60 కోట్లను 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ స్థాయిలో కొనుగోలు జరగడం ఈ ఏడాది ప్రత్యేకతగా నిలిచిందన్నారు.కందుల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు స్వయంగా గుర్తించి, ప్రత్యేక చొరవతో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని తెలిపారు. మార్కెట్లో కందుల ధర క్వింటాల్‌కు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు మాత్రమే ఉండటంతో రైతులు నష్టపోతున్నారని, అందుకే ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,000 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేపడుతోందని వివరించారు.ఈ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని, రైతుల కష్టాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటోందని హనుమంత్ రెడ్డి అన్నారు. దళారుల చేతికి రైతులు చిక్కకుండా, పండించిన ప్రతి క్వింటాల్ కందులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు ఎలాంటి సందేహాలు లేకుండా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ఎక్కడా కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకముందే రాయదుర్గం నియోజకవర్గంలో ప్రారంభించడం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసుల ముందుచూపు, రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, ఉప్పర సంఘం డైరెక్టర్ ఆనంద్ రాజులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుడిసెలపల్లి హనుమంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రైతు డిపో చాంద్ బాషా, మాజీ మండల కన్వీనర్ లాలెప్ప, కవిట్ మాబు, షేక్ ముజ్జు, వరుణ్, ఫక్రుద్దీన్ మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ఈఈఎంటి పరీక్షలో సత్తా చాటిన హితేష్




అగళి, జనవరి 12 ప్రభాతవార్త

ఈఈఎంటి 2025-26 పరీక్షలో శ్రీ సత్యసాయి జిల్లా 10వ తరగతికి సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్ మెంటర్ టీచర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈప రీక్షలో ఎస్‌జి హితేష్ 52 మార్కులతో మధుడి ఉన్నత పాఠశాలకు చెందిన వాడు. ఇతను జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి సత్తా చాటారు. ఉపాధ్యాయులు, టీచర్లు, తల్లిదండ్రులు హితేష్ ప్రతిభపై హర్షం వ్యక్తం చేశారు.

# వైకాపాలో చేరిన కాంగ్రెస్ నేతలు


కండువా వేసి వైకాపాలోకి ఆహ్వానిస్తున్న దీపిక

లేపాక్షి, జనవరి 12 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని చోళసముద్రం, బిసలమానేపల్లికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం లేపాక్షి మండల కన్వీనర్ సయ్యద్‌నిస్సార్, వైస్ ఎంపిపి ఆంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో హిందూపురం వైకాపా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపికా సమక్షంలో చోళసముద్రంకు చెందిన శంకరాచారితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైకాపా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మైదుగోళం రామాంజి, శేషాద్రిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీరామ్, ఆసిఫ్, పాల్గొన్నారు.

# హిందూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

## -ఉపాధ్యాయ సమితి జాతీయ సమావేశంలో తీర్మానం

లేపాక్షి, జనవరి 12 ప్రభాతవార్త


కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో ఆర్.జి. హెచ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన హిందూ ఉపాధ్యాయ సమితి సమావేశంలో హిందూ ఉపాధ్యాయల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సంస్థ వ్యవస్థాపకులు ఆచార్య మహేష్ డేగల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కుల కోసం, సంక్షేమం కోసం తాము నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులకు అన్ని విషయాల్లో అండగా నిలుస్తామని పేర్కొన్నారు. గాలి చేతన్ మాట్లాడుతూ హిందుత్వం గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులకు పాఠశాల దశ నుండే ధర్మం పట్ల అవగాహన కల్పించాలన్నారు. హిందూధర్మం, సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడుతూ హిందూ విద్యార్థినిలకు లవ్ జిహాదీల పట్ల అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థినిలు దురాలవాట్లకు లోను కాకుండా చైతన్య పరచాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ఘన నివాళులు

గుత్తి, జనవరి 12 ప్రభాతవార్త


మాజీ ఎమ్మెల్యే నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపల్ కౌన్సిలర్ సుజాతమ్మ భర్త రిటైర్డ్ రైల్వే ఉద్యోగి శీనయ్య మృతి పట్ల సోమవారం మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సిఎస్ఐ కాంపౌండ్‌లో ఆయన మృతి పట్ల స్తుతి కూడిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైవిఆర్ పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వరదరాజులు, రామసుబ్బారెడ్డి, రంగస్వామి, జీపు రమణ, రంగప్రసాద్, సిఎస్ఐఆర్‌డి ఎంబిఏ కళాశాల కరస్పాండెంట్ రసల్‌కిరణ్, మాజీమార్కెట్‌యార్డ్ చైర్మన్ మల్లయ్య యాదవ్, మున్సిపల్‌వింగ్‌అధ్యక్షుడు మహమ్మద్‌షఫీ, నాయకులుబాబురావు, అబ్దుల్ బాసిత్, పవన్‌కుమార్, రియాజ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులకు అండగా సర్వ ప్రజా సేవా ట్రస్ట్

హిందూపురం టౌన్ జనవరి 12 ప్రభాతవార్త


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం పట్టణంలో మానవత్వమే పరమావధిగా సర్వ ప్రజా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత కొద్దిరోజులుగా చలి తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో, రోడ్లపై నివసించే నిరాశ్రయులు, వృద్ధులు, అనాథలను ఆదుకునేందుకు ట్రస్ట్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని బస్ స్టాండ్ ప్రాంతం, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు, ప్రధాన రహదారుల వెంబడి చలితో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, వారికి దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మునిరాజు లోకేష్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న నిరాశ్రయులను ఆదుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

# క్రీడలవల్ల ఉన్నతశిఖరాలను అదిరోహించవచ్చు.

ధర్మవరంటౌన్, జనవరి 12 ప్రభాతవార్త


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీనాయకుడు సంధారాఘవ

క్రీడల వల్ల ఉన్నతశిఖరాలను అదిరోహించవచ్చని చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ క్రీడాకారులకు సూచించారు. ధర్మవరం ఆర్డీటీ క్రీడామైదానంలో అండర్12 బాలుర మండల స్తాయి క్రికెట్ టోర్నీని సోమవారం నిర్వహించారు. ఈ టోర్నీని చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ ముఖ్యఅతిధిగా హాజరై మ్యాచ్ ను ప్రారంబించారు. బత్తలపల్లి, ధర్మవరం జట్లు తలపడ్డాయి. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు నిర్ణీత 20ఓవర్లకు ఒక వికెట్ నష్టానికి 242 పరుగులు సాదించింది. ఈ జట్టులో గోవర్ధన్ 101 పరుగులు, బద్రీనాథ్ 64 పరుగులు సాదించారు. అనంతరం బరిలోదిగిన బత్తలపల్లిజట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 81 పరుగులు తీసి పరాజయమైంది. దీంతి 161 పరుగుల తేడాతో దర్మవరం జట్టు ఘనవిజయంసాదించింది. అనంతరం సందారాఘవ మాట్లాడుతూ. చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. ప్రస్తుతం క్రీడల వల్ల ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీటీ ఆర్డీ హనుమంతప్ప, ఏటీఎల్ శ్రీనివాసులు,టీడీపీ నాయకులు కొత్తపేట ఆది,జింకాపురుషోత్తం, జింకలరాజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉరుకులు, పరుగులతో వీధుల్లో తడి, పొడి చెత్త సేకరణ

- పంచాయతీ కార్యాలయానికే పరిమితమైన కొత్త రిక్షాల వినియోగం
- వీధుల్లో చెత్తకుప్పలు శుభ్రంచేసి పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు
- పర్యవేక్షించిన మేజర్ పంచాయతీ కార్యదర్శి, స్వచ్ఛభారత్ ఎంసీవో


ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంవద్ద చెత్త నుండి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తున్న క్లాప్ మిత్రలు

ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త

వార్త ప్రభావం


కొత్త రిక్షాలతో వీధుల్లో తడి, పొడి చెత్తను సేకరిస్తున్న క్లాప్ మిత్రలు

ఉరవకొండ పట్టణంలో పారిశుధ్యం మెరుగు, వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఇటీవల పంచాయతీకు సరఫరా అయిన కొత్త రిక్షాల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో వానపాముల ఎరువు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసే కార్యక్రమాలు సోమవారం ఉరుకులు పరుగుల మీద కొనసాగాయి. పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవో షేక్ మహమ్మద్ రఫీ సిబ్బంది, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ యం.జయప్రకాష్‌గౌడ్ పారిశుద్ధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. 'వార్త'లో సోమవారం "నిర్లక్ష్యంతో నీరుగారుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యం..!" అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడటంతో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టి అక్కడక్కడా చెత్తచెదారాన్ని, వ్యర్థాలను శుభ్రం చేయించి పొడి సున్నం చల్లించారు. స్వచ్ఛభారత్ ఎంసీవో యం.జయప్రకాష్‌గౌడ్ క్లాప్ మిత్రలతో పట్టణంలోని 10వ వార్డు, అంబేద్కర్‌నగర్‌లో కొత్త రిక్షాలతో ఇంటింటికీ చెత్త సేకరణ చేయించి దాన్ని గుంతకల్లు రోడ్డులోగల ఎస్‌డబ్ల్యూపీసీకు తరలించి అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీలో ప్రస్తుతం 100 కేజీల వరకు వానపాముల ఎరువు ఉందని అవసరమైనవారు తీసుకెళ్లవచ్చన్నారు. పకడ్బందీగా ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు నాగరాజు, రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

# దేశవ్యాప్త లఘు చిత్రాలతో... అనంతలో షార్ట్ ఫిలిం ఫెస్టివల్

- పోస్టర్లు ఆవిష్కరించిన...సినీ నిర్మాత జిఎం సురేష్
- దేశవ్యాప్త లఘు చిత్రాలతో రెండు రోజుల చిత్ర ప్రదర్శనలు

గోరంట్ల, జనవరి 12 ప్రభాతవార్త


పోస్టర్ విడుదల చేస్తున్న సినీ నిర్మాత జి.ఎం సురేష్

అనంతపురం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో 8వ అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్-2026 పోస్టర్‌ను సోమవారం సినీ నిర్మాత జిఎం సురేష్ ఆవిష్కరించారు. అనంతపురం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 8వ అనంత" షార్ట్ ఫిలిం ఫెస్టివల్-2026 వారోత్సవాలు జనవరి 27 నుంచి 31 వరకు అనంతపురము జిల్లా వేదికగా ఘనంగా జరగనున్నట్లు రషీద్ బాషా ఫిల్మ్ ఫెస్టివల్ డైరెక్టర్ తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో భాగంగా జనవరి 27న ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించబడతాయి. జనవరి 28న ప్రత్యేక ఆకర్షణగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో ఏఐ టూల్స్ ఉపయోగించి పాటలు రచించడం, ట్యూన్ కట్టడం, మ్యూజిక్ కంపోజిషన్, పాటలకు సెలెబ్రిటీస్టైల్ డాన్స్ వీడియోలు సృష్టించడం వంటి ఆధునిక అంశాలపై ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించనున్నారు. ఈ శిక్షణ యువ చిత్రకారులకు, కంటెంట్ క్రియేటర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. జనవరి 29, 30 తేదీల్లో దేశవ్యాప్తంగా ఎంపికైన లఘు చిత్రాల ప్రదర్శనలు నిర్వహించబడతాయి. సామాజిక, సాంస్కృతిక, వినోదాత్మక అంశాలతో రూపొందిన నాణ్యమైన లఘు చిత్రాలు ప్రేక్షకుల కోసం ప్రదర్శించ బడతాయి. ఫెస్టివల్ చివరి రోజు జనవరి 31న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించబడుతుంది. ఉత్తమ లఘు చిత్రాలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందజేయనున్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా యువ ప్రతిభను ప్రోత్సహించడం, నూతన సాంకేతికతను సినీ రంగంతో అనుసంధానించడం ప్రధాన లక్ష్యమని అనంతపురం ఫిలిం సొసైటీ అధ్యక్షులు రషీద్ బాషా తెలిపారు. లఘు చిత్ర నటీనటులు, దర్శక, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు తాము రూపొందించిన లఘు చిత్రాలను జనవరి 20వ తేదీలోగా 9676350681, 7288022467కు పంపించాలన్నారు. సినీ అభిమానులు, ప్రజలు, విద్యార్థులు, యువ చిత్రకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## - జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి (కలెక్టరేట్), జనవరి 12, ప్రభాతవార్త


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి, ఎస్పి

జిల్లాలో జీఎస్డీపీ వృద్ధి, ఆర్టీజీఎస్ అమలు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో వేగం పెంచాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా జీఎస్డీపీ వృద్ధి, రైతులకు కీలకమైన ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ వంటి అంశాలపై సోమవారం ఏపీ సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీసీ అనంతరం అధికారులతో జేసి మాట్లాడుతూ, జిల్లాలో జీఎస్డీపీ వృద్ధికి అనుగుణంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, రైతులకు సంబంధించి ఆర్టీజీఎస్ ద్వారా నిధుల పారదర్శక బదిలీ, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ ప్రక్రియను వేగవంతంగా, తప్పుల్లేకుండా పూర్తిచేసే దిశగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు సంబంధిత సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని, ముఖ్యంగా రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జేసి పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డితో పాటు సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

03ATP12_03ATP12.qxd 12-01-2026 PM 10:49 Page 1



## యస్వీ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజనోత్సవం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

స్థానిక యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆదేశాలమేరకు స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఎ.వి. ప్రసాద్ హాజరై మాట్లాడుతూ..దేశ నిర్మాణం, అభివృద్ధి, దేశం యొక్క పురోగతి దాని యువత సహకారంపై ఆధార పడి ఉంటుందని దేశాబివృద్ధిలో యువశక్తి చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తు ందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.టి.శ్రీనివాసులు, ఏవో శ్రీనాథ్,ఎన్ ఎస్ ఎస్ పిఓలు జి.ఆనంద్ బాబు టి.సుదర్శన్ రెడ్డి, ఐ ఐ సి కన్వీనర్ యస్.రిజ్వానా బేగం అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌జెయుపి క్యాలెండరు, డైరీ ఆవిష్కరణ

అనంతపురం న్యూటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

రాష్ట్రీయ జాతీయ ఉపాధ్యాయ జిల్లా పరిషత్ క్యాలెండర్, డైరీలను సోమవారం జిల్లా విద్యాశాకాదికారి కార్యాలయంలో డైరీని జిల్లా విద్యాశాఖాదికారి ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థులను తీర్చి దిద్దాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు లు రాశినేని రామా నయుడు ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, రాష్ట్ర కార్యదర్శి శేషగిరి, వెంకట రమణ, ప్రభాకర్, కేశవ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## రాజ్యాధికారం యువత భవిష్యత్తుగా మారాలి

### - ఆల్ ఇండియా యూత్ రిజర్వేషన్ ఫోరం అధ్యక్షుడు నరేంద్ర



మాట్లాడుతున్న ఆల్ ఇండియా యూత్ రిజర్వేషన్ ఫోరం అధ్యక్షుడు నరేంద్ర

అనంతపురం న్యూటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

రాజ్యాధికారం యువత భవిష్యత్తుగా మారాలని ఆల్ ఇండియా యూత్ రిజర్వేషన్ పోరం అధ్యక్షుడు నారేంద్ర పిలుపునిచ్చారు. అనంతపురం నగరం లోని ప్రెస్ క్లబ్‌లో ఆల్ ఇండియా యూత్ రిజర్వేషన్ ఫోరం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమా వేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రా ష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఎస్సీ జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసగాని కుల్లాయప్ప, ఎస్సీ జన సంఘం కుల్లాయప్ప, ఆదినారా యణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు. వివేకానంద జయంతిని పురస్కరిం చుకొని వక్తలు మాట్లాడుతూ.. యువత పెద్ద ఎత్తున ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రాజకీయాలలో తమ భాగస్వామ్యాన్ని పెద్ద ఎత్తున రూపొందిం చుకోవాలనే ఉద్దేశంతో దేశవ్యా ప్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో భాగంగా అనంతపురం జిల్లా కేంద్రానికి రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు



అంగన్వాడీ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 12 ప్రభాతవార్త

అనంతపూర్ అర్బన్ ప్రాజెక్ట్ నేతాజీ కాలనీ అంగన్వాడి సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమా నికి ఐసిడిఎస్ సిడిపిఓ అనురాధ, సూపర్వైజర్ హేమ, పిల్లల తల్లులు హాజరైనారు. పిల్లలకు హరిదాసు వేషం, రైతు లాగా, అమ్మాయిలకు మన సంప్రదాయ వస్త్రాలు వేసినారు. అనురాధ పిల్లలందరికీ భోగి పళ్ళు పోసి పిల్లలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని దీవించారు.

## రోడ్డుపై ఉన్న గుంతలను కూర్చండని అధికారులకు విజ్ఞప్తి : సిపిఎం



రోడ్డుపైన ఉన్న గుంతలు

నార్పల, జనవరి 12, ప్రభాతవార్త

నార్పల నుండి నాయనపల్లి వెళ్లే జిల్లా రహదారి మీద 50 కి పైగా గుం తలు పడ్డాయి. వీటిని పూడ్చాలని గతంలో సిపిఎం మండల కమిటీ అధికారులకి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. కానీ ఇంత వరకు గుంతలు పూడ్చలేదు. కూతలేరు బ్రిడ్జి దాటిన వెంటనే ఒక్కొక్క గుంత 15 అడుగుల పొడవుతో ఐదు ఆరు అడుగుల వెడల్పుతో ఒకటి నుండి రెండు అడుగులలోతుతో పడ్డ గుంతలు దాదాపు 20 దాకా ఉన్నాయి. దీనివల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కారణం గుంతలను తప్పించుకొని రోడ్డు బాగా ఉన్న వైపు వెళ్లేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గుంతలు పూడ్చడానికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు పత్రికలలో వస్తున్నది. గుంతలు పడడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు. తక్షణం గుంతలు పూడ్చా లని సిపిఎం నార్పల మండల కమిటీ కోరుతున్నది. నడిమి దొడ్డి గ్రామంలో జరిగిన సిపిఎం పార్టీ సమావేశంలో మండల నాయకులు ఎం ప్రభాకర్, రామాంజనేయులు,ఎర్రి నాగప్ప, నాగమణి నాగన్న, ఆదినారా యణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ తాడిపత్రి శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద జయంతి మరియు భారత యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద స్ఫూర్తి యువతలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపడం, దేశభక్తిని రగిలించడం, సామాజిక సేవను ప్రేరేపించడం, జాతీయతా భావాన్ని పెంపొందించడం వంటి వాటిపై కేంద్రీకృతమై ఉంటుందని నాయ కులు పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సూక్తులు యువతను సన్మార్గంలో నడిపి స్తూ, భారతదేశ సాంప్రదాయాలను ప్రపంచానికి చాటాలని ప్రోత్స హిస్తాయన్నారు. శ్రీస్వామి వివేకానంద స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశం యొక్క అభివృద్ధి దేశ యువత యొక్క శక్తిని మన దేశ సామర్థ్యాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపి చాటిచెప్పారన్నారు. వికసిత్ భారత్ స్ఫూర్తితో ప్రధాని పరిపాలన కొనసాగిస్తున్నాని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు చెన్నా రంగనాయకులు, యువమోర్చ పట్టణ అధ్యక్షులు మధు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, వెంకటసుబ్బయ్య, గంగాధర్ యాదవ్, కృష్ణమోహన్, శివ, సంజీవరాయుడు, అమరావతి, భాను, ఈశ్వరయ్య, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద స్వామి సూక్తులు ఎళ్లవేళల ఆచరణీయం



వివేకానంద స్వామి సూక్తులు ఎళ్లవేళల ఆచరణీయం



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం, జనవరి 12 ప్రభాతవార్త బ్యూరో

స్వామి వివేకానంద సూక్తులు ఎల్లవేళలా ఆచరణీయమని చిన్మయ మిషన్ స్వామి ఆత్మ విధానంద పేర్కొన్నారు. స్వామి వివేకానంద 163వ జయంతిని సోమవారం వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో వివేకానంద భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమ ఒకు ముఖ్య అతిథులుగా చిన్మయ మిషన్ స్వామి ఆత్మ విధా నంద, ముఖ్య అతిథి రిటైర్డ్ ఏఎస్పి జె మల్లికార్జున వర్మ మాట్లా డుతూ.. వివేకానంద స్వాములు వారు తక్కువకాలం జీవించి నప్పటికీ వారి ప్రేరణ సమాజానికి ఎల్లప్పుడు మార్గదర్శకమని తెలియ జేశారు. ఆ తదుపరి అశోక్‌నగర్‌లోని స్వామి వివేకానంద పార్క్‌లో గల స్వామి వివేకనంద విగ్రహానికి పూలమాలలతో యోగ కేంద్ర సభ్యులు, మాజీ కార్పొరేటర్ సరిపోట రమణ, తదితర పెద్దలందరూ పాల్గొని నమస్కరి ంచుకున్నారు. అంతకుముందు హనుమాన్ చాలిస్, భగవద్గీత పఠనం రాజ భజన హనుమంత్ రెడ్డి నిర్వహించారు. స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణ విగ్రహాలకు పూలమాలలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యా జిల్లా జడ్జి నారాయణ, వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షులు ఎం. రాజా శేఖర రెడ్డి, కార్యదర్శి హనుమంత రెడ్డి, దివాకర్, కోఆర్డినేటర్, మారుతిప్రసాద్, సుశీల, కృష్ణవేణి, ధనుంజయ అన్ని యోగ సెంటర్స్ నుండి యోగ సాధకులు పాల్గొన్నారు.

## ఆగస్టు 16 నాటికి గౌతు లచ్చన్న విగ్రహ ఆవిష్కరణ చేద్దాం

### - ఈడిగ గౌడ సంఘం నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ

అనంతపురం కల్చరల్, జనవరి 12 ప్రభాతవార్త

ఆగస్టు 16 నాటికి గౌతు లచ్చన్న విగ్రహ ఆవిష్కరణ చేద్దాం అని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ని గౌడ్ సంఘం నేతలకు హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా అధ్యక్షులు సురేంద్ర కమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈడిగ కులస్థులు వారి క్యాంపు కార్యాలయంలో కలిసి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం పిల్లర్ ధ్వంసం, త్వరలో విగ్రహం ఏర్పాటు గురించి మాట్లాడారు. విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేసే విషయం తొందరలోనే మీకు తెలియచేసి, వారి జయంతి నాటికి లచ్చన్న విగ్రహాన్ని అందరి సమక్షంలో నిర్మాణం జరుపుకుందామని, మంచి సర్కిల్‌లో నిర్మాణం జరుపుకొని సర్దార్ గౌత్ లచ్చన్న సర్కిల్ అని నామకరణం చేసి, జయంతి నాటికి ఆగస్టు 16 రోజున విగ్రహం ఆవిష్కరణం జరపాలని హామీ ఇవ్వడంతో కుల సభ్యులు అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో పెద్దలు పాలచెర్ల ఆదినారాయణ, రేణుకా యల్లమ్మ ఈడిగ భవన్ అధ్యక్షులు జె.నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షు లు నాయనపల్లి రాజు, కమిటీ సభ్యులు, శ్రీశైలం ఆర్యగౌడ ఈడిగ సత్రం అడహక్ కమిటీ కో కన్వీనర్ ఈడిగ లక్ష్మినారాయణ, నాయకులు సొల్యం శ్రీనివాసులు, చంద్రబాబునగర్ నాగభూషణం, అనంతపురం పట్టణ కల్లు సొసైటీ అధ్యక్షులు రఘురామయ్య, మాజీ అధ్యక్షులు మల్లికార్జున, సొసైటీ సభ్యులు, జిల్లా గౌడ్ సంఘం సోషల్ మీడియా నాయకులు శివానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్కేయూ ఇంజనీరింగ్ ఫార్మసి ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలి

### - ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

ఎస్కేయూలో ఇంజనీరింగ్, ఫార్మసిటికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతి పదికన పని చేస్తున్న ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ డిమాండ్ చేసారు. ఈ మేరకు ఎస్కె యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్బంగా నల్లపల్లి విజయభాస్కర్ సందర్బంగా మాట్లాడుతూ.. ఈ ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న జీతాలు పెంచలేదని, చాలీచాలని జీతాలతో ఆర్థికంగా చాలా నష్టపోతున్నారని తెలిపారు. కళాశాలలో పని భారం ఉన్నప్పటికీ సక్రమంగా విధులు నిర్వహిస్తున్న వీరికి స్కేల్ వర్తింప చేస్తే వారి జీవితాలు బాగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయూ ఇంజనీరింగ్, ఫార్మసిటికల్ టెక్నికల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రవి మోహన్, మారుతి కుమార్, క్రాంతి కుమార్, చంద్రశేఖర్, భాస్కరరావు, కరుణాకర్, గుణశేఖర్, మురళీధర్, భవాని, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద ఆలోచనలే జాతికి సరైన దిశానిర్దేశం

### - బిజెపి అధ్యక్ష కార్యదర్శులు అంజినాయక్, కుమారస్వామి

### - ఘనంగా స్వామి వివేకానంద జయత్సోవం



.స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

పామిడి, జనవరి 12 ప్రభాతవార్త

ప్రస్తుత నేపద్యంలో జాతికి సరైన దిశానిర్దేశం చేయగలిగేది స్వామి వివేకానంద ఆలోచనలు మాత్రమే అని ఆయన బోధించిన వ్యక్తి నిర్మాణం, సాంస్కృతిక జాతీయ వాదం సామాజిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు మన మనుగడను నిర్దేశిస్తాయని బిజెపి అధ్యక్ష కార్యదర్శులు అంజి నాయక్, కుమారస్వామి పేర్కొన్నారు. సమకాలిక సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుని దేశంలోని యువతకు ప్రేరణగా నిలుస్తూ సాంస్కృతిక జాతీయ వాధానికి బలమైన పునాదులు వేసిన స్వామి వివేకానంద జయంతోత్సవాలను పురష్కరించుకుని సోమవారం బిజెపి శ్రేణులు పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ దేశం ధర్మం ఆధారంగా వికసించి ధర్మం ఆధారంగా నిలబడిందని ధర్మశక్తే సరస్వం ధర్మమే ఆధారంగా మన జాతీయత స్థిరంగా నిలబడాలని మహాపురుషులు పని చేసుకుంటూ వచ్చారని వారిలో దయానంద సరస్వతి, అరవింద మహర్షి, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద అగ్రగణ్యులు అన్నారు. భగవంతుణ్ణి చేరేందకు అనేక మార్గాలు ఉన్నాయని ఆమార్గాలేవి సంస్కరణలకు కారణంగా కాదంటూ అన్నిమతాలు ప్రపంచ శాంతిని బోధిస్తాయని ఆదిశగా అందరూ ఆలోచించాలని, నేను హిందువుని అని అనుకోవటమే మహాపాపంగా భావిస్తున్న రోజుల్లో నేను హిందువుని అని గర్వంగా చెప్పుకోవాలంటూ ఉద్బోదించిన మహానుభావుడు స్వామి వివేకానంద అని తెలిపారు. వేదాంత తత్వాన్ని అందరికీ అర్థం అయ్యేటట్లు చెప్పటమే కాకుండా సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే ఈదేశం జాగృతం కా వాలంటే అట్టడుగు వర్గాల నుండి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చాడని తెలి యజేశారు. మహాపు రుషులు చూపిన మార్గంలో పయనించటమే దేశానికి శ్రేయస్కరం అని హితబోధ చేసిన స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముం దుకు సాగాల్సిన అవసరం ఎం తైనా వుందన్నారు. ఈకా ర్యక్రమంలో బిజెపి నాయకులు రైజింగ్ రాజశేఖర్, పవన్‌కు మార్, ఎస్సీ సెల్ యువమోర్చా జిల్లా నాయకులు నల్లబోతుల జగదీష్, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## .నేడు గార్లదిన్నెలో మండల ప్రజా పరిషత్ సర్వసభ సమావేశం



ఎంపిడిఓ యం. గోపాల్.

గార్లదిన్నె, జనవరి 12,ప్రభాతవార్త:

గార్లదిన్నె మండల ప్రజా పరిషత్ సర్వసభ సమావేశం నేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు అధ్యక్షత వహించనున్నారని తెలిపారు. మండల అభివృద్ధి, గ్రామాల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా ఆరోగ్యం, విద్య, తాగునీ రు, పారిశుధ్యం, ఉపాధి హామీ, వ్యవసాయం, రహదారులు-భవనాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీ సీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మండల అధికారులు తప్పని సరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ యం. గోపాల్ కోరారు.

## "హలో కామ్రేడ్ చలో ఖమ్మం " పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

తాడిపత్రిటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో హలో కామ్రేడ్ చలో ఖమ్మం పోస్టర్లను సిపిఐ నాయకులు ఆవిష్కరించారు. సిపిఐ తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ళ ప్రస్థానం సందర్బంగా ఈనెల 18న ఖమ్మంలో జరుగు మహాసభను జయప్రదం చేయాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 సంవత్సరం డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకొని. 101 సంవత్సరంలో అడుగు పెట్టిందన్నారు. రష్యాలో లెనిన్ నాయకత్వాన 1917 అక్టోబర్‌లో జరిగిన మహా విప్లవ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు సిద్ధాంతాలపై చర్చలు ప్రారంభమై వివిధ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు రూపుదిద్దుకున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయకార్యదర్శి నాగేంద్ర, రత్నమయ్య, శీనా, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఓ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ రాజగోపాల్

తాడిపత్రిఅర్బన్, జనవరి 12 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం రహదారి భద్రత మాసోత్సవాలను ఏర్పాటు చేశారు. ఆర్టీఓ కార్యాలయానికి డ్రైవింగ్ లైసెన్సులు, ఎఫ్‌సి, తదితర సేవల కోసం వచ్చిన వారితో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, 18 సంవత్సరాలలోపు వారు వాహనాలు నడపరాదని, ఆటోల్లో కెపాసిటికి మంచి ప్రయాణీకులకు తరలించరాదని, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గుర్తులు గమనించి సిగ్నల్స్ లైట్లను అనుసరించి వాహనాలను నడపాలని, వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి వుండాలని ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు.

## విజయ సాయి కుమార్ ను అభినందిచిన పాన్ ఇండియా అధికారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్ జనవరి 12 ప్రభాతవార్త

విజయ సాయికుమార్ కి స్వామి వివేకానంద ఇన్స్పిరేషనల్ అవార్డు రాజమండ్రి కి చెందిన పాన్ ఇండియా వారు స్వామి వివేకానంద 163వ జయంతిని పుష్కరించుకొని జాతీయ స్థాయిలో అందించే స్వామి వివేకానంద ఇన్స్పిరేషన్ అవార్డు ను సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ కు ప్రకటించడం పట్ల తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు టి వి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు ఈరోజు విజయవాడలోని హోటల్ ఐలాపురంలో జరగనున్న జాతీయ అవార్డుల ప్రధానానోత్సవ కార్యక్రమానికి అనారోగ్య కారణాల వల్ల విజయసాయి కుమార్ హాజరు కాలేనందున ప్రశంసా పత్రాన్ని,అవార్డును కొరియర్ ద్వారా అందుకున్నారుఈ సందర్బంగా డావిజయ సాయికుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద అవార్డు రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని దీనితో బాధ్యతలు మరింత పెరిగాయని ఆయన అన్నాడు పలువురు నగర ప్రముఖులు, సాహితీ సంస్థలు, స్వచ్చంద సంస్థలు ఆయనకు అభినందనలు తెలియజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు

## క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన ముఖ్యం

### - కిమ్స్ సవేరా వైద్యురాలు గీతారాణి



కిమ్స్ సవేరా వైద్యురాలు గీతారాణి

అనంతపురం సిటీ, జనవరి 12 ప్రభాతవార్త

క్యాన్సర్‌పై మహిళలు వీడి అవగాహన పెంపొందిం చుకోవా ల్సిన అవసరం ఎంతైనా ఉందని కిమ్స్ సవేరా కన్సల్టెంట్ అబ్ స్ట్రెటీషియన్, గైనకాలజిస్ట్ గీతారాణి పేర్కొ న్నారు. మహిళల్లో ఎక్కువగా నిర్లక్ష్యం చేయబడే సమస్యల్లో సర్వీకల్ ఆరోగ్యం (గర్భాషయ ముఖద్వార ఆరోగ్యం) ఒకటన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రతి యేటా జనవరిలో సర్వీకల్ హెల్త్ అవగాహన మాసంగా పాటించడం జరుగుతోందన్నారు. మహిళల్లో సర్వీకల్ క్యాన్సర్‌పై అవగాహన పెంచి సకాలంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్స హించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి మహిళ వీటిపై అవగాహన పెంపొందించుకోవడం వల్ల తమ జీవితాన్ని ఆరోగ్య వంతంగా కాపాడు కునేందుకు దోహద పడుతుందని ఆమె పేర్కొన్నారు.

## యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

### - బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలం వేస్తున్న బిజెపి నేతలు

అనంతపురం సిటీ, జనవరి 12 ప్రభాతవార్త

యువతకు స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానంద అని బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. వివేకానంద జయంతిని బిజెవైఎం జిల్లా అధ్యక్షులు తేజేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మాని ంచి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వివేకానంద సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో భారతీయ యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి అజేష్ యాదవ్, సీనియర్ నాయకురాలు లక్ష్మిదేవి, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఆపస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162 జయంతి




నివలులు అర్పిస్తున్న ఆపస్ నేతలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

స్వామి వివేకానంద 162వ జయంతి, జాతీయ యువజన దినోత్స వం సందర్బంగా అనం తపురంలోని స్థానిక టవర్ క్లాక్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా శాఖ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపస్ జిల్లా అధ్యక్షు రాలు కళ్యాణి మాట్లాడుతూ.. వివేకానందుని యొక్క బోధనలను ఆశయా లను స్మరించుకున్నారు సమావేశంలో ఈనాటి యువత వివేకానందుని జీవితం నుంచి జీవన పాఠాలు నేర్చుకుని సర్వశక్తివంతులుగా తయారైతే నే దేశం ఉజ్వలంగా ఉంటుందని అందుకు వివేకానంద యొక్క బోధనలను ప్రతి పాంశాలలోనూ తప్పనిసరిగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వై. రామన్న జిల్లా కార్యదర్శులు పీజీ రమేష్, దాసరి వరదరాజులు, మలోబన్న, మోక్షిత్, లక్కీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## కస్తూర్బా పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టులకు నోటిఫికేషన్ - ఎంఈఓ జయానాయక్ వెల్లడి



.ఎంఈఓ జయానాయక్.

పామిడి, జనవరి 12 ప్రభాతవార్త

సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు జిల్లాల వారిగా సమగ్ర శిక్ష కార్యాల యం ద్వార నిర్వహించబడుతున్న కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్నటువంటి బోధన భోదనేతర సిబ్బంది పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందకు నోటిపికేషన్ విడుదల చేశారని ఎఈఓ జయనాయక్ సోమవారం 'ప్రభాతవార్త' ద్వార తెలియజేశారు. పామిడి కేజీబీవీలో ఖాళీగా ఉన్న 2 సహాయ వంటమనిషి పోస్టులకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 23వ తేది సాయంత్రం 5 గంటలలోపు మండల విద్యాధి కారి కార్యాలయం నందు ధరఖాస్తులను అందజేయాలని వెల్లడించారు.

## వివిధ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే నార భరత్ రెడ్డి



రస్తా భూమి పూజ చేస్తున్న నారభరత్ రెడ్డి

బళ్ళారి జనవరి 12 ప్రభాతవార్త:

బళ్లారి నగరంలోని 5వ వార్డు. కాకర్లతోటలో, గుగ్గరహట్టి వైపు నుండి కాకర్లతోట, ముండ్రిగి, మించేరి వరకు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో లీదీళి రోడ్డుకు 0.60 కి.మీ నుండి 1.5 కి.మీ వరకు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నార భరత్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా, బాబు జగ్జీవన్ రామ్ తోలు పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ ముండ్రిగి నాగరాజ్, బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పి. గాదెప్ప, 5వ వార్డు కాకర్లతోట కార్పొరేటర్ రాజు, 7వ వార్డు బాపూజీ నగర్ కార్పొరేటర్ ఉమాదేవి శివరాజ్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర సమన్వయకర్త ముండ్రిగి అరుణ్ కుమార్, హవాంభవి లోకేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారి జిల్లా నూతన ఎస్పి డా.సుమన్ పన్నేకర్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన కర్ణాటక జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు.



ఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం.

బళ్లారి జనవరి 12 ప్రభాతవార్త:

బళ్లారి జిల్లా కర్ణాటక జర్నలిస్ట్ అసోసియేషన్ బృందం బళ్ళారి నూతన ఎస్పి డా.సుమన్ పన్నేకర్ వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్బంలో అధ్యక్షులు యాల్పీవలీ భాష, ఉపాధ్యక్షులు కే. బజారప్ప, గిరీష్ కుమార్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తాను ఏమ్మెల్యే కాలవ

రాయదుర్గం జనవరి 12 ప్రభాతవార్త

రాయదుర్గం పట్టణ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాల శ్రీనివాసులు పేర్కొన్నారు . రాయదుర్గం పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం ఆయన సీసీ రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీకి వివిధ రూపంలో 10. 15 కోట్లు మంజూరైనట్లు ఈ నిధులతో పట్టణంలో 84ప నులు ప్రారంభించి 32 పూర్తి చేయగా,మరో 42 వివిధ దశల్లో ఉన్నా యన్నారు. నేడు ఒకటవ వార్డులో రూ.9.15 లక్షల విలువైన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సరఫరా పైప్ లైన్ విస్తరణ, తదితర పనులు చేపట్టామన్నారు. ఇదే కాకుండా అమృత్ పథకం కింద రూ.78 కోట్లతో మంచినీటి సరఫరా కార్యక్రమం చేపట్టబోతున్నట్లు వివరించారు. రాయదుర్గం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల పట్టణ వాసుల్లో ఆనందం వ్యక్తం వ్యక్తం అవుతుందన్నా రు. పట్టణ ప్రజల అవసరాలు తీర్చడానికి, సౌకర్యాలు మెరు గుపరచడానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభు త్వం పెద్దపీట వేస్తూ అభివృ ద్ధిని ముందుకు



సిసి రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

తీసు కెళ్తుతాం దన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీలు ము న్సి పల్ పాలక మండలి ఏర్పా టుతో మరిన్ని నిధులను తీసుకొ స్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# కొనుగోలు కేంద్రాన్నిరైతులు సద్వినియోగపర్చుకోండి

రాయదుర్గం జనవరి 12 ప్రభాతవార్త

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం పరుచుకోవాలని రైతు సోదరులందరికీ ఎమ్మెల్యే శ్రీనివాసులు సూచించారు. సోమవారం రాయదుర్గం మార్కెట్ యార్డ్ లోఆయన మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత్ రెడ్డి తో కలిసి కంది సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మూడు ప్రాంతాల్లో కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరను రూ.8వేలు నిర్ణయించగా, బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు రూ.6వేల నుంచి 6500 మాత్రమే ఉంటుంద న్నారు. బహిరంగ మార్కెట్ లో కంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఆదనపు లబ్ధి చేకూరుతుందన్నారు. తెలియని దళారులకు లేకపోతే ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా రైతు చెల్లించే డబ్బులు సురక్షితంగా, రక్షణగా ఉంటాయని వివరించారు. ప్రస్తుత సీజన్లో నియోజ కవర్గంలో 16,319 హెక్టార్ల విస్తీర్ణంలో కంది సాగు చేయగా, 16.891 టన్నుల దిగుబడి వచ్చి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. గత సంవత్సరం రూ.22 కోట్లు కంది సేకరణ ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ సంవత్సరం రైతుల నుంచి భారీ ఎ త్తున కందులు కొనుగోలు చే యటం జరుగుతుందన్నారు. రై తులను ఆదుకోవాలనే ఉద్దేశంతో చంద్రబాబు నాయకత్వం లో ని కూటమి ప్రభుత్వం వరి ధా న్యంతో పాటు మొక్క జొన్న, కందుల కొనుగోల కేంద్రాలను ఏ ర్పాటు చేయించడం జరిగింద న్నా రు. ఈ ఏడాది గతంలో కన్నా ముందుగానే 20 పైగా ధాన్యం



కంది కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సేకరణ కేంద్రాలను రాయదుర్గం నియోజక వర్గంలో ఏర్పాటు చేయించి ఇప్పటి దాకా 25 వేల మెట్రిక్ టన్నులు సేకరి ంచినట్లు తెలిపారు. రూ.61 కోట్లు రైతుల ఖాతాలకు జమా చేయించామ న్నారు. రైతులకు వారం నుంచి పది రోజులోగా డబ్బు చెల్లించడానికి మా ర్బెడ్ అధికారులు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కాలవ వివరించారు. ఈ కా ర్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు రైతులు తదితరులు పాల్గొన్నారు

# టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి గ్రామాల్లో ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత నాపై వదిలేయండి

## రోళ్ల మండలం, గుడ్డుగుర్కి పంచాయతీ నాయకులతో ఎమ్మెల్యే రాజు వ్యాఖ్య

మడకశిర టౌన్ జనవరి 12 ప్రభాతవార్త.

మడకశిర నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం చాలా ఉందని స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు,జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని రోళ్ల మండలం, గుడ్డుగుర్కి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల నాయకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయకుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గుడ్డుగుర్కి గ్రామ పంచాయతీ పరిధిలోని గుడ్డుగుర్కి, గొట్టుగుర్కి, దాసప్ప పాళ్యం, వానప్పపాళ్యం, జీ.ఎన్.పాళ్యం, క్యాతప్పపాళ్యం, గొట్టు గుర్కి గొల్లహట్టి, గుడ్డుగుర్కి గొల్లహట్టి గ్రామాల నాయ కులతో ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ:తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, గౌరవ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు పదే పదే చెప్పే విషయా లను ప్రతి నాయకుడు, కార్యకర్త గుర్తుపెట్టుకోవాలి. టీడీపీకి కార్యకర్తే అధినేత అనే విషయాన్ని ఎవరూ మర్చిపోకూడదు. పార్టీ నాయకులు, కార్య కర్తలు ఒక్కటై పార్టీని బలవంతం చేసుకుంటూ ముందుకు నడపాల్సిన అవసరం చాలా ఉంది. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలి. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. ప్రజలకు అన్ని సమయాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ఏదైనా మీ స్థాయిలో పరిష్కరించలేని సమ స్య ఉంటే దాని ని తక్షణమే నా దృష్టికి తెచ్చి పరిష్కరించాలి. ప్రజా సంక్షే మం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలి. నాయకులు కార్యకర్తల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా లి. కార్యకర్తలే పార్టీకి కొండంత బలం అనే విషయాన్ని నాయకులు గుర్తుపె ట్టు కోవాలి. వారికి ప్రభుత్వం తరపున అందే ప్రతి పథకాన్ని అందేలా చర్యలు తీసుకోవాలి అని ఎం. ఎస్. రాజు అన్నా రు.ప్రతి సమస్యను పరిష్కరి స్తానాపై వదిలే యండి..గ్రా మాల్లోని పలు సమస్యలను నాయకులు, కార్యర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.



నాయకులు,కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

వీధిలైట్లు, సిమెంటు రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీలు, భూమి సమస్యలు, ట్రాన్స్ ఫార్మ ర్లు, పెన్షన్లు వంటి వివిధ రకాల సమస్యలను గ్రామ నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతి సమస్యను ఎమ్మెల్యే నోట్ చేసుకున్నారు. సమావేశంలో తలెత్తిన ప్రతి సమస్యను తప్ప కుండా పరిష్కరిస్తానని నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే సచివాలయ సెక్రటరీలతో మాట్లాడి పరిష్కరించారు. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. రోళ్ల మండలం, గుడ్డుగుర్కి గ్రామ పరిధిలోని గ్రామాల సమస్యలన్నింటినీ తనపై వదిలేయాలని, ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత నాపై వదిలేయండి అని ఎమ్మెల్యే భరోసా ఇవ్వడంతో నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి స్వామి, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ, మండల కన్వీనర్ జి.కె.ఈరన్న, సింగిల్ విండో ప్రెసిడెంట్ దాసిరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ మారుతీ, సింగిల్ విండో డైరెక్టర్ భరత్, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి - పిజిఆర్ఎస్ కు 400 అర్జీలు

## జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ

అనంతపురం కలెక్టరేట్ జనవరి 12 ప్రభాతవార్త

వివిధ సమస్యలను పరిష్కరించాలని జిల్లా నలుమూలల నుండి వచ్చి వచ్చిన ప్రజల నుండి స్వీకరించే అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులను ఇన్చార్జి కలెక్టర్ స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ మలోల, కళ్యాణ్ దుర్గం ఆర్డీవో వసంత బాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్ తిప్పే నాయక్ రామ్మోహన్ పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలకు సంబంధించిన ఆడిట్ జిల్లా అధికారులు ప్రాధాన్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన అర్జీలపై వెంటనే స్పందించి వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. సిఎంఓ, మంత్రులు, ఎమ్మెల్సీ ,ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు ద్వారా సిఫారసు చేసిన లేఖలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ పెండింగ్ లేకుండా పంపిణీ చేయాలని అలాగే రీ సర్వే 22ఏ ఆన్లైన్ ప్రక్రియ, బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా అర్జీల పరిష్కారం తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఇన్చార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# కవి ఆసాది లక్ష్మీనారాయణకు ఎంపీ అంబిక ఘనసత్కారం

నార్పల జనవరి 12, ప్రభాతవార్త

లలిత కళలకు నిలయమైన మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో ముఖ్య భూమిక పోషిస్తూ ఒకవైపు పాత్రికేయునిగా మరొకవైపు కవి,గాయకునిగా సామాజిక సేవా కార్యకర్తగా విశిష్ట సేవలు అందిస్తున్న ఆసాది లక్ష్మీనారాయణకు ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ ఘన సత్కారం చేశారు. శ్రీకళాపీఠం వ్యవస్థాపకరాలు ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన లలిత కళారాధన కార్యక్రమంలో భాగంగా కవిసమ్మేళనంలో పాల్గొన్న కవి ఆసాది లక్ష్మీనారాయణను ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ ఘన సత్కారం చేశారు. అనంతపురంలోని పాతూరు శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం కళా ప్రాంగణంలో శ్రీ కళా పీఠం నిర్వాహకురాల ఉమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లలిత కళారాధన కార్యక్రమంలో గానం కవిత్వం చిత్రలేఖనం నృత్యం శిల్పం కళాలలో ప్రావీణ్యం ఉన్నవ్యక్తులను సమీకరించి సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి



సత్కారం చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ముఖ్యఅతిథిగా హాజరైన అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనిషి మానసిక ఉల్లాసంకు శారీరక రుగ్మతల రూపుమాపడానికి మన లలిత కళలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వాటిని కాపాడుకుంటూ వస్తున్నవారిని రాబో వు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండా లని తెలియజేయాలన్నారు. వీరిని ప్రోత్స హిస్తున్న ఇలాంటి సంస్థలను అభినందించాలన్నారు.పిల్లలను చదువుతోపాటు సంగీత సాహిత్య నృత్య శిల్పా చిత్ర లేఖ నం కళలలో ప్రోత్సహించేలా చేయాల న్నారు. అనంతరం కవి ఆసాది లక్ష్మీ నారాయణను శాలువతో సత్కరిం చి, ధ్రువీకరణ పత్రం జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంస్థ ఫౌండర్ ఉమాదేవి డైరెక్టర్లు శేషాచార్యులు,ప్రసాద్, కవులు జూటూరు షరీఫ్,నాగేంద్ర, లక్ష్మీనారా యణ గాయకులు బాబా జార్జిరెడ్డి, కృష్ణవేణి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళకు ఒక పని.. స్వయంగా ఆదాయం ఉండాలి

**- ఆ దిశగా మహిళలు అడుగు వేయాలన్న ఎమ్మెల్యే పరిటాల సునీత - ఐసీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కిట్టుమిషన్లు పంపిణీ**
**- రామగిరిలో 400మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా మిషన్లు పంపిణీ - పాఠశాలకు వెళ్లే పిల్లలకు సైకిళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



కుట్టుమిషన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జనవరి 12 ప్రభాతవార్త

ప్రతి మహిళకు ఒక పని వచ్చి ఉండాలని.. వారు స్వయంగా ఆదాయం అర్జించే విధంగా ఉండాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇన్ఫిన్స్ చారిటబుల్ ఫౌండేషన్ (ఐసీఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో కిట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నా రు. రామగిరి మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రా మ స్వరాజ్యం సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, ఐసీఎఫ్ ఛైర్మన్ సూగేపల్లి విజయ్ కిశోర్, చల్లా కిషోర్ చౌదరి, వన్నూరు స్వామి, సరస్వతి తదితరులు పాల్గొ న్నారు. మొత్తం 400మంది మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందజేశారు. మహిళలు స్వయంగా ఉపాధి పొందే విధంగా ఏదో ఒక పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఐసీఎఫ్ చేస్తున్న ప్రయత్నం చాలా గొప్ప దన్నారు. మహిళలకు ఉచితంగా కుట్టులో శిక్షణ ఇచ్చి.. 50శాతం సబ్సిడీతో మిషన్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఆత్మకూరు మండలంలో 2వేల మిషన్లు, రాప్తాడులో 800 మంది మహి ళలకు మిషన్లు అంద జేశారన్నారు. వీటిని తీసుకున్న మహిళలు వాటిని పక్కన పెట్టకుండా.. ముందుగా ఇంట్లో వారి దుస్తులు కుట్టడం దగ్గర నుంచి పని మొదలు పెట్టాలన్నారు. కిట్టుమిషన్లలో ప్రతిభ సాధిం చగలిగితే రోజు వెయ్యి నుంచి 15వందల వరకు సంపా దించ వచ్చన్నారు. ప్రభుత్వంతో కలసి ఇలాం టి సంస్థలు అందించే సహకా రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహి ళలు ఆర్థికంగా బాగుం డాలన్న ఉద్దేశ్యంతో మొదటి నుంచి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అన్నింటా వారిని భాగస్వామ్యం చేస్తోం దన్నారు. దాదాపు అన్ని పథకాలు వారి పేరు మీద ఉండేలా చేస్తోందన్నారు. మరోవైపు ఈ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు సైకిళ్లు అందజే స్తోందని.. మా ప్రాంతంలో కూడా అవసరం ఉన్న వారికి సైకిళ్లు ఇవ్వాలని కోరారు. గ్రామ స్వరా జ్య సంస్థతో పాటు ఐసీఎఫ్ ను ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా అభినందించారు.

# సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకం కావాలి

**- ఎంఎల్సి రామచంద్రారెడ్డి**



ఎంఎల్సి పుష్పగుచ్ఛం అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, జనవరి 12 ప్రభాతవార్త**

సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకంనకావాలని టీచర్స్ ఎంఎల్సి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పద్మవాణి హైస్కూల్లో కరస్పాండెంట్ నాగపీరయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ సమస్యలపై శాసనమండలిలో ఎక్కువగా ప్రస్తావించామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఈఎస్ఐ, పిఎఫ్, తదితర సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది విద్యార్థుల కంటే తక్కువగా వున్న 960 ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వం గుర్తించిందని వాటిని మూసివేయాలని అధికారులు చర్చిస్తుంటే తాను అభ్యంతరం తెలిపానన్నారు. వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం వుందని స్కూళ్లు మూసివేస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుందని వివరించామన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉపాధ్యాయులపై దాడులు జరుగుతున్నాయని దాడి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే డిఎలు తదితర బకాయిలు చెల్లిస్తారని ప్రభుత్వ ఉపాధ్యాయులు బావించారని పెండింగ్లో వున్న 4 డిఎలు విడుదల చేయలేదన్నారు. అడిగేవాడు వుంటనే సమస్యలు పరిష్కారం అవుతాయని సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలు ఏకం కావాలన్నారు. ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని దానికి అనుగుణంగా విద్యాసంస్థలు ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులను దేశానికి అవసరమైన శక్తిగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయులు లక్ష్యంగా నిర్ణయించుకోవాలన్నారు. సమస్యలపై వినతిపత్రం అందచేస్తే శాసనమండలిలో ప్రస్తావిస్తానని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, సాయివిజేత స్కూల్ పుల్లయ్య, నాగవీరారెడ్డి, మౌర్య స్కూల్ ఆంజనేయులు, టార్గెట్ స్కూల్ ఏ.జయచంద్ర, ప్రగతి స్కూల్ సుబ్రమణ్యం, పిఆర్టియు నాయకులు కేశవనాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్పై విషప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

## - స్వార్థ ప్రయోజనాల కోసం సొంత ప్రాంతానికి అన్యాయం చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్ - మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్రెడ్డి విమర్శ

అనంతపురం సిటీ, జనవరి 12 ప్రభాతవార్త

ఏ ప్రాజెక్టు నిర్మాణం చేయాలన్నా తొలుత తాగునీటి ప్రాజెక్టు పేరుతో మొదలు పెడతారని తెలిసి కూడా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కూటమి నేతలు విషయ ప్రచారం చేస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్రెడ్డి విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తానే ఆపించానని స్వయంగా తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి మాట్లాడినా ఇంత వరకు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఖండించలేకపోయారని ఆయన విమర్శించారు. అంతేకాకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుతో ప్రయోజనమే లేదన్నట్లు మాట్లాడటం రాయలసీమ ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని ఆయన మండి పడ్డారు. 20 టీఎంసీల గురించి ఇంత రాద్ధాంతం అవసరమా అని స్వయంగా చంద్రబాబునాయుడు మాట్లాడటం పట్ల రాయలసీమ ప్రజలు విస్తుపోతున్నారన్నారు. 20 టీఎంసీలతో 2 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయన్న విషయం చంద్రబాబుకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి, రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు మెప్పు కోసం తన సొంత ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, కెప్ట్ ప్రాజెక్టు అని బాధ్యతాయుతమైన మనిషజగా ఉండి పయ్యావుల కేశవ్ ఎలా మాట్లాడు తారని ఆయన మండి పడ్డారు. వైసిపి హయాంలో ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వంతో సంబంధం లేకుండా రూ. 900 కోట్లు చెల్లించారని పయ్యావుల కేశవ్ చెబుతు న్నారన్నారు. అయితే ఇదే ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.190 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లిం చారని గుర్తు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్రెడ్డి

చేశారు. కెప్ట్ ప్రాజెక్టు అయితే రూ.190 కోట్లు మీ ప్రభుత్వ హయాంలోనే ఎలా చెల్లించా రని, ఇందులో వాటాలు ఏమైనా తీసుకున్నారా అని ఆయన మండి పడ్డారు. రాయలసీమకు ఎంతో కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వాదనలను వినిపించేందుకు కనీసం లాయర్ను కూడా నియమించక పోవడం సిగ్గు చేటన్నారు. రాయలసీమ ప్రాంత ప్రయోజనాల కంటే అమరావతి ప్రయో జనాలే ము ఖ్యమన్నట్లు సీఎం చంద్ర బాబునాయుడు వ్యవహరి స్తున్నారని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఈరన్న, కూడేరు మండల పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం 18 నెలల్లో 100 కోట్లు అభివృద్ధి పనులు చేశాం

**- వైసీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లడాలి, ప్రజలను రెచ్చగొట్టి రాజకీయాలు చేయేద్దు- ఏ ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రలందరికి తెలుసు - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పై అసత్య ఆరోపనలు మానండి - టి.డి.పి జిల్లా ఉపాధ్యక్షుడు బండి ఆదినారాయణ**

బుక్కరాయసముద్రం జనవరి 12 ప్రభాతవార్త

నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి కేవలం 18 నెలల్లోనే 100 కోట్లు పైచిలుకు పనులు చేశాం,వాటిని గమనించకుండ వాస్తవాలు తెలుసుకొని వైసీపీ నాయకులు మాట్లడాలి,రాజకీయ పబ్బాలకోసం ప్రజలను రెచ్చగొట్టుతున్నారు.శింగనమల నియోజకవర్గంలో వైసీపీ పాలనలో ఎంత అభివృద్ధి జరిగింది.కూటమి పాలనలో కేవలం 18 నెలలకే ఎంత అభివృద్ధి జరిగిందో నియోజకవర్గం ప్రజలందరికి తెలుసు,ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పై అసత్య ఆరోపనలు మానండి అని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దండువారిపల్లి ఆదినారాయణ ఆరోపించారు. సోమవారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహిం చారు.ఈ సమావేశానికి టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ తోపాటు టిడిపి అధికార ప్రతినిది ఓబుల పతి, నాయకులు పెద్దప్ప,బుల్లే నారాయణ స్వామి, గంగాధర్, మల్లికార్జున, శివారెడ్డి,బండి బాలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లడుతూ నియోజకవర్గంలో సాగు-తాగు నీరు, విద్యా, వైద్యం,గ్రామాల అభివృద్ధి,రైతు సంక్షేమం కొరకు వంద కోట్లు పై చిలుకు పనులు చేయడం జరిగింది.వివరాల్లోకి వెలితే గత 40 సంవత్స రాలుగా సాగునీటికోసం ఎదురుచూస్తున్న రైతులకు ఒక టిఎంసీ నీటి కేటాయింపుకు ప్రభుత్వం జీవో జారీచేసి రైతులకు భరోసా కల్పించాం, బుక్కరాయసముద్రం మండల కేంద్ర ంలో పేదల ఆకలి తీర్చడానికి రూ,40 లక్షల నిధులతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశాం వాటిని త్వొరలోనే ప్రారంభి స్తామన్నారు.పిఆర్ఐ డిపార్ట్మెంట్ పరిదిలో 28.58 కోట్లుతో సీసీ, బిటి రోడ్లు వేయడం జరిగింది.వాటితోపాటు పిఐయు డిపార్ట్ముంట్ పరిదిలో 31.09 కోట్లతో రోడ్లపనులు,బుక్కరాయసముద్రం మండలంలో రేకులకుంట నుండి సిద్దరాంపురం మీదుగా పసులూరు వరకు,బిటిరోడ్డు, శింగనమల మండ లంలో సలకంచెరువు నుండి తాడిపత్రి రోడ్డు వరకు బ్రిడ్జి నిర్మా ణం,చింతకాయ మందనుండి మల్లాగుండ్ల వరకు చిత్రవతి నదిపై బ్రిడ్జి నిర్మా ణం చేపట్టడం జరుగుతుంది,వాటితోపాటు కొత్తరోడ్లు,యల్లనూరు మండల ంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గదుల నిర్మాణం,బుక్కరా యసముద్రంలో అంబేద్కర్ భవనం,గార్లదిన్నెలో మైనార్టీ పాఠశాల, ఎంపీఆర్డ్యామ్ అభివృద్ధి,వాటర్షెడ్ ప్రోగ్రాం,ఇలా చెప్పుకుంట పోతే అనేక అభివృద్ధి పను లు ఉన్నాయన్నారు.వైసీపీ పాలనలో అడ్డదిబ్బలో గరుసుతోపాటు ఎర్రమట్టి ,ఇసుక,మాఫియా ఇవన్నీ అభివృద్ధినే,శింగనమల మండలంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైయిందని గొప్పలు చెప్పుకున్నారే తప్ప అక్కడ ఒక ఇటుక కూడ పెట్టలేదు,నాయనపల్లి క్రాస్లో రోడ్డు వస్తరణలో దేవా లయంను పడగొట్టి అందులోని సామగ్రితో ఇల్లు నిర్మించుకొన్నది ప్రజ లకు తెలుసు,ఏ దైనా వాస్తవాలు తెలుసుకొని వైసీపీ నాయకులు మాట్లాడాలి మా ఎమ్మెల్యే పై అసత్య ఆరోపనులు చేస్తే ఊరుకొనేదిలేదన్నారు.

# పెద్దమ్మతల్లిని దర్శించుకున్న మాజీ మంత్రి డా,శైలజానాథ్

బుక్కరాయసముద్రం జనవరి 12 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రేకులకుంట గ్రామంలో 56 సంవత్సరాల తరువాత నిర్వహించిన గ్రామ దేవర మహోత్స వం సందర్భంగా గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు సోమవారం శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పెద్దమ్మతల్లిని దర్శిం చుకున్నారు.గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.అనంతరం డాక్టర్ పాకేశైలజనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించి ,గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో సమృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆయనతో పాటు మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్రెడ్డి, జడ్పిటీసీ నీలం భాస్కర్,బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి,నిశాలవాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు సాకే నారాయణస్వామి,రామక్రిష్ణ,సాకే లక్ష్మినారాయణ,అక్కులప్ప తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లిని దర్శించుకున్న మాజీ మంత్రి శైలజానాథ్